క్లుప్తంగా

ఇసుక నిల్వపై రైతుల ఫిర్యాదు



తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

తాళ్లపూడి: వేగేశ్వరపురానికి చెందిన గోదావరి లంకలో తమ సొంత భూముల్లో బోట్స్ మెన్ సొసైటీ వారు ఎటువంటి అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేస్తున్నారని రైతులు తైలం ప్రసాద్, తైలం పుల్లయ్య తదితరులు తాళ్లపూడి తహశీల్దార్ పి.మోహనభారతికి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసారు. సర్వే నంబర్ 298/2లో గల తమ భూముల్లో వేసిన ఇసుక నిల్వలను ఖాళీ చేయించాలని రైతులు కోరారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ



సమిశ్రగూడెంలో పాడి రైతులకు పశువుల దాణా అందజేస్తున్న పశువైద్యాధికారి మోహన్‌రావు

నిడదవోలు రూరల్: పాడి రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ మోహన్‌రావు సూచించారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరంలోని రైతు సేవా కేంద్రాల్లో పాడి రైతులకు రాయితీపై పశువుల దాణాను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, స్థానిక నాయకులు మేడా పూర్ణ, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, గోగిన శ్రీను, వెటర్నరీ అసిస్టెంట్ ఎం.సత్తిరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



ఖండవల్లిలో బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శన

పెరవలి: ఖండవల్లిలో వేంచేసియున్న పోలేరమ్మవారి జాతర సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. సోమవారం నిర్వహించిన మ్యూజికల్ నైట్ యువకులను ఉర్రూతలూగించింది. అనంతరం ప్రముఖ నాట్య కళాకారిణి నరుకుల సాయిశ్రీ ప్రియ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. సాయిప్రియ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలను సుమారు 15 వేల మంది తిలకించారని నిర్వాహకులు తెలిపారు.

సత్రం భూముల కౌలు వేలం

తాళ్లపూడి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం రాజమహేంద్రవరం శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం భూముల కౌలు వేలం దేవదాయ శాఖ అధికారులు నిర్వహించారు. కోటిలింగాల సత్రంకు సంబంధించి తాళ్లపూడిలో 3.6 ఎకరాల భూమి ఉండగా సంవత్సరానికి కౌలు వేలం నిర్వహించారు. వేగేశ్వరపురానికి చెందిన మామిడాల బుజ్జి కౌలు వేలం దక్కించుకున్నారు. రూ.2.08 కౌలుగా నిర్ణయించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ విశ్వనాథ రాజు, సిబ్బంది లక్ష్మి నరసింహ, పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ వీరన్న పాల్గొన్నారు.

దివ్యాంగులకు రోటరీ క్లబ్ సహాయం

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సహాయం అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా అన్నారు. అంధత్వంతో బాధపడుతున్న పది మంది యువకులకు ఆరునెలలకు సరిపడే బియ్యం, నిత్యావసరాలు, రైస్ కుక్కర్, భోజనం చేయడానికి అవసరమైన కంచాలు, గ్లాసులను సోమవారం క్లబ్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెంకట్ ఇమ్మాణి, సెక్రటరీ సురేష్, ఉదయగిరి, ప్రెసిడెంట్ ఎలక్ట్ మండవల్లి వెంకన్న బాబు, సెక్రటరీ ఎలక్ట్ రఘునాథరాజు పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వ సేవలు పొందేందుకుగానూ ప్రతి పౌరుడు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కేవలం సంక్షేమ పథకాల కోసమే కాకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్యాక్స్ పేమెంట్, ల్యాండ్ రిజిస్ట్రేషన్లు వంటి సేవలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారులతో పాటు ఇతర కార్డుదారులు, ఆర్థికంగా ఉన్నత వర్గాల వారు కూడా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందడటం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలో నివసించే ప్రజలు ముందుకు వచ్చి తమ పరిధిలోని సచివాలయాలను సంప్రదించాలన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు ఏవీ?

- పడకేసిన పల్లె వైద్యం
- అమలు కాని ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ పథకాలు
- అల్లాడుతున్న దీర్ఘకాలిక రోగులు
- బీపీ, సుగర్ రోగులకు అందని మందులు
- ఏడాది నుంచి నిలిచిన ఇన్సులిన్ సరఫరా



పెరవలిలో వెలవెలబోతున్న పీహెచ్‌సీ

పెరవలి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే గ్రామీణ ప్రాంత రోగులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేద రోగులకు వరంలా మారింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేడు పూర్తిస్థాయిలో వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రోగులు వాపోతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు, ఆరోగ్య శ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షల కోసం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందించేవారు. నేడు గ్రామాల్లో ఎక్కడా ఎటువంటి వైద్య శిబిరాలు కానరాకపోవడంతో రోగులు పడే పాట్లు వర్ణనాతీతం. రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు నేడు జబ్బు చేసిందంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

సుగర్, బీపీ పేషెంట్లకు భరోసా లేదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా సుగర్, బీపీ వంటి రోగాలు జనాలను పట్టిపీడిస్తున్నాయి. వీటి వలన రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ సరఫరా ఆగిపోవడంతో రోగులు అల్లాడిపోతున్నారు. సొమ్ములు ఇచ్చి కొనుగోలు చేసుకోలేక, పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేక రోగులు నానాపాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇన్సులిన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని వారంటున్నారు.

నియోజకవర్గంలో 56 వేలమంది మధుమేహ వ్యాధిగ్రస్తులు

నిడదవోలు నియోజకవర్గంలో సుగర్ వ్యాధిగ్రస్తులు 56,000 మంది ఉండగా వీరిలో పేదలు 44,000 మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందేవారే. వీరిలో ఇన్సులిన్ తీసుకునే దశలో ఉన్న మధుమేహ రోగులు 13 వేల మంది వరకూ ఉన్నారు. వీరందరూ ప్రతి రోజు ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంది. ఇందులో పేదలు ఉండటం వలన ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నడుపల్లిలో గర్భిణిని ఇంటి వద్ద ఆరోగ్య వివరాలు అడుగుతున్న వైద్యురాలు తేజశ్రీ (ఫైల్)

ఏడాది నుంచి నిలిచిన ఇన్సులిన్ సరఫరా

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచి సుగర్ వ్యాధిగ్రస్తులకు అందించే ఇన్సులిన్ సరఫరా ఏడాది కాలంగా లేకపోవడంతో రోగులు నానా పాట్లు పడుతున్నారు. పీహెచ్‌సీలకు ఇన్సులిన్ సరఫరా నెలల తరబడి నిలిచిపోవడంతో రోగులకు సమాధానం చెప్పలేక వైద్య సిబ్బంది నానా అగచాట్లు పడుతున్నారు.



ఖండవల్లిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు (ఫైల్)

ఆదుకున్న ఆరోగ్య సురక్ష

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించినప్పుడు రోగులు ఆనందించేవారు. వైద్య శిబిరాలకు వచ్చిన వారికి వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు తరలించేవారు. నేడు గ్రామాల్లో ఆ మాటే వినిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు నిత్యం వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.కనీసం మందులు కూడ అందుబాటులో ఉండటం లేదని రోగులు దీనంగా చెబుతున్నారు.

ఇన్సులిన్ లేక ఇబ్బందులు



సుగర్ వ్యాధి కారణంగా ప్రతి రోజు నేను ఇన్సులిన్ తీసుకోవాలి లేకుంటే ఆరోగ్యం క్షీణిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే ఇన్సులిన్ లేదు అంటున్నారు. 9 నెలలుగా ఇన్సులిన్ దొరక్క బాధపడుతున్నాను. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే ఆర్థిక స్తోమత లేక అప్పు చేయాల్సి వస్తోంది. చాలా ఇబ్బందిగా ఉంది.

–కుసుమే శ్రీనివాస్, మధుమేహ బాధితుడు, లంకమాలపల్లి

మందులు అందుబాటులో ఉంచాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుగర్ నివారణకు పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉండటం లేదు. ముఖ్యంగా ఇన్సులిన్ అందుబాటులో లేదు. కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. దీని వలన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి.

– గరగ అనసూయ, సుగర్ బాధితురాలు, కానూరు

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి నెలా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందిస్తున్నాము.

– పి.తేజశ్రీ, వైద్యురాలు, పీహెచ్‌సీ కానూరు

అయోమయంలో 'వైట్‌బర్లీ' రైతులు

గోపాలపురం: మండలంలోని భీమోలు, కరగపాడు గ్రామాల్లో పండించిన వైట్‌బర్లీ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వైట్ బర్లీ పొగాకు సాగు చేయాలని, పంట కొనుగోలు చేస్తామని చెప్పి, వైట్‌బర్లీ కంపెనీ ప్రతినిధులు తొమ్మిది నెలల క్రితం రైతులకు మందులు పంపిణీ చేశారు. దీంతో, భీమోలు, కరగపాడు గ్రామాల్లోని రైతులు సుమారు 150 నుండి 200 ఎకరాల్లో వైట్‌బర్లీ పొగాకు సాగు చేశారు. పంట చేతికి వచ్చి సుమారు నెల రోజులవుతున్నా కంపెనీ ప్రతినిధులు రాలేదని, పంట ఇంటి వద్దే నిల్వ ఉండిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం కంపెనీ ప్రతినిధులు కానీ, వైట్‌బర్లీ మందులు పంపిణీ చేసిన వ్యాపారులు కానీ పంట కొనుగోలుకు రాకపోవడంతో దిక్కుతోచడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని వైట్‌బర్లీ పొగాకు విక్రయాలు జరిగేలా చూడాలని కోరుతున్నారు.



భీమోలులో వైట్‌బర్లీ పొగాకు చూపుతున్న రైతులు

నూతన వేతన ఒప్పందంపై కుదిరిన అంగీకారం

- నెలకు రూ.2,900 అదనపు వేతనం
- 12 డిమాండ్లపై అగ్రిమెంట్

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లో పలు గ్రామాల్లోని క్వారీల్లో పనిచేస్తున్న ఎర్త్ మూవర్స్ కార్మికులకు మూడేళ్ల కాలపరిమితికి వేతన ఒప్పందం కుదిరింది. ఈ నెల 17న కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత సమక్షంలో నిర్వహించిన యజమానులు, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన చర్చల్లో నూతన వేతన ఒప్పందంపై చర్చించారు. ఈ చర్చల్లో కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై అదనంగా రూ.2,900 ఇవ్వడానికి యజమానులు అంగీకరించారు. దీంతో పాటు మరొక 11 డిమాండ్లను యజమానులు అంగీకరించారు. దీనిపై సోమవారం దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన యజమానులు, కార్మిక సంఘాల నాయకులు నూతన వేతన ఒప్పందం అమలుపై చర్చించారు. వేతన ఒప్పంద పత్రాలపై యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు, కార్మిక సంఘాల (ఐఎఫ్‌టీయూ) ప్రతినిధులు సంతకాలు చేశారు. ఒప్పంద పత్రాన్ని ది వెస్ట్ గోదావరి క్వారీ క్రషర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, ప్రధాన కార్యదర్శి దోనెల్లి మధుబాబు, ఉపాధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ, కోశాధికారి కోట్ల కనకేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆండ్రు అనీల్ మాట్లాడుతూ నూతన వేతన ఒప్పందం 2028 మే 4వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై అదనంగా నెలకు రూ. 2,900 పెంచినట్టు ఆయన తెలిపారు. హెల్పర్లకు ఆపరేటర్‌కు ఇచ్చే వేతనంలో 50 శాతం అదనంగా ఇవ్వడానికి, ప్రస్తుతం ఇస్తున్న బేటాలపై అదనంగా రూ. 50 ఇవ్వడానికి, సంవత్సరం పనిచేసిన కార్మికుడికి నెల బోనస్‌తో పాటు జత దుస్తులు, మూడేళ్ల పైబడి పనిచేసిన కార్మికులకు ఏడాదికి 15 రోజుల జీతం అదనంగా ఇవ్వడానికి అంగీకారం కుదిరిందన్నారు. ప్రతి కార్మికుడికి యజమాని జనతా బీమా చేయించాలని, బీమా చేయని కార్మికుడు మరణిస్తే పరిహారంగా రూ.5.50 లక్షలు, మట్టి ఖర్చులకు రూ.30 వేలు యజమానులు ఇవ్వడానికి అంగీకరించినట్టు ఆయన తెలిపారు. పలు అంశాలతో కూడిన ఒప్పంద పత్రంపై కార్మిక సంఘాల (ఐఎఫ్‌టీయూ) నాయకులు, యజమానుల అసోసియేషన్ నాయకులు సంతకాలు చేసినట్టు ఆండ్రు అనీల్ తెలిపారు. ఈ సమావేశంలో క్వారీ, క్రషర్ల అసోసియేషన్ ప్రతినిధులు కొప్పాక మోహన్ చైతన్య (చిన్ని), కొప్పాక సాయి, గన్నిన శ్రీనివాస్, దాపర్తి వీరకృష్ణ, కొండపాముల సత్తిబాబు, సత్తి అనంతరెడ్డి, ఎర్త్ మూవర్స్ వర్కర్స్ యనియన్ అధ్యక్షుడు ఎస్. ఎస్.హరిగోపాల్, గౌరవాధ్యక్షుడు పి. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్, పౌరహక్కుల సంఘం నేత నంబూరి శ్రీమన్నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.



గౌరీపట్నంలో కార్మిక సంఘు నాయకులకు వేతన ఒప్పంద పత్రం అందజేస్తున్న ఆండ్రు అనిల్, యజమానులు

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

ఇద్దరు నిర్వాహకులు, విటుడి అరెస్ట్

దేవరపల్లి: గుట్టుచప్పుడు కాకుండా స్థానిక మారుతీనగర్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార స్థావరంపై దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులతో పాటు, ఏలూరుకు చెందిన విటుడిని అరెస్ట్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకర్లకు సీఐ నాగేశ్వర్ నాయక్ ఈ వివరాలు తెలిపారు. మారుతీనగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐతో పాటు, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, వీఆర్వోతో కలిసి ఉదయం 11 గంటల సమయంలో ఆ ఇంటిపై దాడి చేశారు. సోదాలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కొంతకాలంగా గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన జుట్టా బేబీ, దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన సిర్రా రవి కలిసి ఇంటిని అద్దెకు తీసుకున్నారు. మహిళలను మభ్యపెట్టి వ్యభిచార కూపంలోకి దింపారు. ఆ సంపాదనతో ఇద్దరూ విలాసవంతంగా ఉంటున్నట్టు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితులైన జుట్టా బేబీ, సిర్రా రవి, ఏలూరుకు చెందిన విటుడిని వ్యభిచార నేరం కింద అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతున్నట్టు తెలిపారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బేబీకి చెందిన కారును సీజ్ చేసినట్టు చెప్పారు. ఇలాంటి స్థావరాలు ఇంకెక్కడైనా ఉన్నాయా అనేది పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతామని తెలిపారు. అక్కడక్కడా వ్యభిచార స్థావరాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. పూర్తి ఆధారాలతో దాడులు నిర్వహిస్తామని వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగేశ్వర్ నాయక్

ఆదర్శనీయుడు సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నిడదవోలు : అత్యంత ఆదర్శవంతమైన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు అన్నారు. పీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య జాతీయ స్థాయి రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎ. డేనియల్ ఉస్మాన్, రసూల్, సత్యనారాయణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తిరుపతిలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టి, మూత్రం పోసి హత్యాయత్నం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ చర్యలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గండి శ్రీనివాసరావు, ప్రసాద్, సుబ్బారావు, మంగరాజు, పోసి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

తాళ్లపూడి(కొవ్వూరు): డివిజన్‌లో ప్రజల నుంచి వచ్చే ఎటువంటి సమస్యలనైనా సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ మీకోసం- పీజీఆర్ఎస్ ద్వారా పది ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. డివిజన్ అధికారులు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను తీర్చే విధంగా చర్యలు తీసు కోవాలని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను 1100 మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా తెలిజేయవచ్చని తెలిపారు.

మీ కోసంలో వచ్చిన అర్జీల వివరాలు

కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన బెల్లంకొండ శ్రీనివాస్ తమ గ్రామంలో 9వ వార్డులో డ్రెయినేజీ నిర్మించాలని అర్జీ అందజేశారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన ఈడూరి వెంకట కృష్ణారావు తన స్థలం సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



కాకరపర్రులో నూతనంగా ప్రారంభించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప ఆలయాలు నిర్మించడం గ్రామానికి శుభసూచకమని ఇటువంటి కార్యక్రమంలో తాను పాలు పంచుకోవటం తన పూర్వ జన్మ సుకృతమని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. పెరవలి మండలం కాకరపర్రులో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప ఆలయాలను సోమవారం ప్రారంభించారు. ఆలయాలను దర్శించుకోవటానికి వచ్చిన సందర్భంగా ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, గ్రామస్తులు ఎంతో అభిమానంతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన ఆలయాలు, స్వామివార్ల విగ్రహాలు ఎంతో సుందరంగా ఉన్నాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ, వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్, చెర్ల శ్రీరామచంద్రమూర్తి నామన ఆంజనేయులు, మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు దారి మళ్లించారని ఆరోపణలు

తాళ్లపూడి: మండల విద్యా శాఖ పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ వ్యవస్థ ద్వారా పాఠశాలల్లో మౌలిక అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దారి మళ్లినట్లు ఆరోపణలున్నాయి. మండలంలో మలకపల్లి, తాళ్లపూడి కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటికి ఏడాదికి కాంప్లెక్స్ సమావేశాలు తదితర నిర్వహణకు సుమారు లక్ష రూపాయలకు పైగా నిధులు వస్తాయని సమాచారం. వీటిని ఖర్చు చేసే అధికారం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌కు, పర్యవేక్షించే అధికారం మండల స్థాయిలో అధికారులకు ఉంటుంది. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నిధులు దుర్వినియోగం అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. మండల విద్యాశాఖ కార్యాలయానికే పరిమితం కావాల్సిన సమాచారం ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు కూడా అక్కడ పని చేస్తున్న సిబ్బందిపై వచ్చాయి. దీంతో మిగిలిన పాఠశాలల నిర్వాహకులు నష్టపోతున్నట్టు తెలిసింది. దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం. నిధుల దుర్వినియోగంపై మండలస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్టు సమాచారం. దీనిపై ఎంఈవో బాలామణి, నెహ్రూజీ మాట్లాడుతూ ఆరోపణలు తమ దృష్టికి రాలేదని, ఆరోపణల్లో నిజం లేదని, ఫిర్యాదు వస్తే విచారణ చేయిస్తామని తెలిపారు.

సర్వారాయుడు మృతికి తలారి నివాళి



చాగల్లులో సర్వారాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: చాగల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గవర సర్వానాయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆపార్టీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. సర్వారాయుడు నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పరామర్శించారు. రాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వివాహ శుభకార్యానికి హాజరైన తలారి

మండలంలోని ఊనగట్ల గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్త తొర్లపాటి ఏసు కుమారుడు రాజు వివాహ వేడుకకు తలారి వెంకట్రావు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, ఆర్టీఏ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటొ వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు బొర్రా రజినీ ప్రసాద్ నాయకులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, తోట రామకృష్ణ, గెడా శ్యామ్, పిండి మంగరాజు, తాళ్లూరి దామోదరం, వీరవల్లి సత్యనారాయణ, చిక్కం నరసింహమూర్తి, తొర్లపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.